ఆకాశంలో . మబ్బులు నల్లగా దట్టంగా కమ్ముకుని ఉన్నాయి. చినుకు చినుకు పడుతూ ఉంది. ఈదురు గాలి వదలకుండా వీస్తూ ఉంది. అయిదారు రోజుల్నించి ఇదే వరస. ఊరు మునగ దీసుకుని పడుకున్నట్లు ఉంది. ఊరి బయట పెద్ద మర్రిచెట్టు ఉంది. ఆ మర్రిచెట్టు నానుకుని పాడు పడిన సత్రం ఉంది. గాలికి సత్రం గోడలన్నీ కదిలి మరల అలాగ నిలబడి ఉన్నాయి. అవి ఎప్పుడు కూలిపోతాయో ఆ భగవంతుడికే తెలుసు. సత్రం గోడలో ఒక ఎండిన రావికొమ్మ ఉంది. ఆ కొమ్మ ఆధారంగా మూడు రెమ్మలు పచ్చగా నిలిచి ఉన్నాయి. రాత్రి గాలి దెబ్బకి ఆ పెద్ద మర్రిచెట్టు వేళ్ళతో సహా పెకలించుకుని పడిపోయింది. గోడ నెర్రలు ఇచ్చి ఆ కొమ్మ బయటికి వచ్చి వేలాడుతూ ఉంది. విశాలమయిన పాడుపడిన సత్రం దాదాపు నిర్మానుష్యంగా ఉంది. అప్పటి దాకా వరండాలో నిలబడి గాజు కళ్ళతో ఊరికే చూస్తూ బాధ పడిన ముసలాడు, కర్ర పోటు వేసుకుంటూ లోపలికి వచ్చాడు. కర్ర మూలకి అన్చి, నీరసంగా కూర్చుని వలవల ఏడ్చాడు. బుర్రున ముక్కు చీదుకున్నాడు. ఈ మధ్య ముసలాడు తరుచు ఏడవటం మామూలయింది. అది చూసి కస్సున లేచాడు రంగడు.

'మళ్ళీ ఏమొచ్చిందిరా, ముసలాడా?' అని అరిచాడు.

'నోర్ముయ్యిరా, గుడ్డి సన్యాసీ!' అంటూ గద్గద స్వరంతో మాటకి మాట అప్ప చెప్పాడు ముసలాడు. రంగడు రోషంతో బుసలు కొట్టాడు.

'ఎందుకురా ఆడిమీద అట్టా కస్సుమంటావు? అందరం దిక్కులేని పచ్చులమే. మనలో మనం కుమ్ములాడుకుని ఏం లాభం?' అంటూ సర్దాడు అంకయ్య.

'చూడ్రా మరి! ఆడు. . .' ముసలాడు అందుకున్నాడు.

'పోనీలె, మావా! ఆడు కుర్రాడు. మనవన్నా సర్దుకు పోకపోతే ఎట్టా?' అంకయ్య అన్నాడు.

బుస్సుమని లేవబోయిన రంగడు దానితో ఊరుకున్నాడు. ముసలాడుకూడా ఊరుకున్నాడు కాని, వెక్కివెక్కి ఏడవటం మాత్రం మానలేదు.

'ఎందుకయ్యా ఆ ఏడుపు? ఏమయింది?' ఓదార్పుగా అన్నాడు అంకయ్య.

'ఏదో గ్యాపకం వచ్చింది లేరా. అందుకే ఏడుపు వచ్చింది.'

'అదేంటో మాకూ చెప్పరాదా? నీ గుండె బరువన్నా తగ్గుద్ది.'

'అవునే గాని, ఆకలి దంచేతా ఉంది. పేగులు అరుస్తున్నయి. రొండ్రోజుల్నించి ముద్ద లేదు. ముసురిట్టా ఉంది. ఆ పిచ్చి ముండ అయిపు, అజ లేదు. ఏవయిందో, ఏవో? ఏమవుతుందంటా?'

'అవును. నా పనీ అట్టాగే ఉంది.' అంకయ్య నీరసంగా అన్నాడు.

'నాకూ నీరసంగా ఉంది. పిచ్చమ్మ ఏమయిందో మరి!' రంగడు అందుకున్నాడు.

'ఏవో, బాబులార! ఓ రోజు గాకపోతే ఓ రోజన్నా ఒక ముద్ద లేదు. ఆ పిచ్చిది ఏమయిందో తెలీదు. ముగ్గురం దిక్కులేని పచ్చుల్లాగ దాన్నే నమ్ముకుని ఉంటిమి. బయట గాలి అట్టా గుంది. ఇట్టాగే నాలు గయిదు రోజు లయితే మనం ఏమయేటట్టు భగవంతుడా!' అని ముసలాడు బావురు మన్నాడు.

'ఊర్కోరా, బాబు, అసలె తలుచుకుంటే గుండెలు బెంబే లెత్తి చస్తా ఉంటే నీ ఏడ్పు లొకటి.'

'నోర్మూయ్యండిరా. నా ఏడుపన్నా న న్నేడ్వనీరు! ఏం మడుసులు?' ముసలాడు, రంగడు గొడవ పడ్డారు. కాస్సేపు అరుచుకుని అలిసిపోయి, ముగ్గురూ ఊరక ఉండిపోయారు. మూలను చీకట్లో ముడుచుకుని నిండా బట్ట కప్పుకుని పడుకుని ఉన్న ఆకారం అటు, ఇటు కదిలింది. వణుకుని అణుచుకుని, మరల చలనం లేకుండా మునగ దీసుకుని పడుకుండిపోయింది ఆ ఆకారం.

ముసలాడు ఏడుపు మానలేదు. 'పొన్లే, మావా! ప్రేస్తం ఉంటే ఆ పిచ్చిది ఈ క్షణానే రావచ్చు. తలా ఇంత ముద్ద పడేసి పుణ్యం కట్టుకోవచ్చు. నిజంగా అది మనిషి కాదు, దేవత. దిక్కులేక కొట్టుకుపోతున్న మనకి దొరికిన వరదలోని కొమ్మ అది. ఇప్పుడో, కాస్సేపుకో వత్తుందనే నా నమ్మకం' అన్నాడు అంకయ్య. 'అవునవును' అంటూ వంత పాడారు మిగిలిన ఇద్దర్రూ, ఆశగా.

అంకయ్య ఒక పీక నోట్లో పెట్టుకుని మిగిలిన వాళ్ళకి చెరోటి అందిచాడు. అంటించుకుని, ముగ్గురూ గుప్పుగుప్పున దమ్ము లాగారు. కాస్సేపటికి బీడీ పీక విసిరేసి మరల ఏడుపు లంకించుకున్నాడు ముసలాడు.

'అబ్బ! ఏంటి, ముసలాడా? అసలు ఏంటి నీ బాధ?' విసుక్కున్నాడు రంగడు.

'అవును, మావా. ఏదో ముగ్గురం కలిసి మెలిసి బతుకుతున్నాం గందా? కష్టం, సుఖం అనుబవిస్తున్నాం గందా? నడిట్లో దిక్కు లేక కొట్టుకు పోతున్నాం గందా? రెమ్మ ల్లాంటి మన బతుకులు ఎండిన కొమ్మ లాంటి పిచ్చమ్మనే నమ్ముకున్నయి గందా? అసలు నీ బాదేంటి? మాతో చెప్పి ఆ గుండెల్ని తేలికపర్చుకోరాదా' అంటూ ఓదార్పుగా అన్నాడు అంకయ్య.

మూల నున్న ముసుగు అటు, ఇటు కదిలింది. మరల ఆగింది.

ముసలాడు కళ్ళు తుడుచుకున్నాడు. ముక్కు చీదుకున్నాడు. కాస్సేపటికి నోరు పెగుల్చుకుని చెప్పటం సాగించాడు.

'ఈ గాలి, ఈ వాన—ఈటన్ని చూత్తా ఉంటే నా గుండె పగుల్తా ఉందిరా! నా కూతురు గ్యాపకం వచ్చి గుండెల్ని పిండేత్తా ఉందిరా, బాబా!'

'నీ కో కూతురు ఉందా?'

'ఉండాలి. ఇప్పుడు ఏమయిందో తెలీదు. ఎక్కడుందో, ఎట్టా ఉందో. . .'

'పర్లే. అణ్ణే చెప్పనీ.' రంగడు విసుక్కున్నాడు.

# ఓ కొమ్మ

'ఆ వేళకూడ ఇట్టాగే గాలి, వాన. ఆ సమయంలో పైలా పచ్చీసుగా చుక్కేసుకుంటూ, చీకులు నవులుతూ ఓ సారా దుకాణంలో ఉన్నాను. అప్పుడొచ్చింది కబురు— నా పెళ్ళాం ఆడ పిల్లని కందని. ఉరుక్కుంటూ ఉరుకుగా వెళ్ళాను. తల్లి పక్కలో పడుకుని నల్ల సిద్ది లాగ అటు, ఇటు కదులుతూ ఉంది నా కూతురు. అప్పటి దాకా దగ్గరుండి అన్నీ చూసిన పక్కింటి అన్నమ్మ బావురు మంది. ''ఏంటే ? ఏడుత్తున్నావు?'' అన్నాను. ''ఏముందిరా, నాయినా? పెద్ద ప్రాణం పోయింది రా. ఇంక నీ కేం మిగిలిందని నవ్వమంటావురా?'' అంది. చేతలు దక్కి నిలువు గుడ్లు వేసుకుని చూస్తూ ఉండిపోయాను. ఆ వానలోనే నలుగురు తోడు రాగా శవాన్ని తగలేసి వచ్చాను, నా ఏడుపుని నేను ఏడ్చుకుంటూనే.

''తల్లిని చంపి పుట్టింది. నల్లగ ఎలాగ రాక్షసిలా ఉందో'' అన్నారు నలుగురూ. అటు, ఇటు కదులుతూన్న ఆ పసిగుడ్డు మీద నాకు కోపం పొంగి వచ్చింది. అక్కడే పీక పిసికి చంపేయాలనిపించింది. ఎందుచేతనో చేతులు రాలేదు. పోన్లే పాపిష్టిది. ఈ వెధవ మొఖాన్ని చంపి ఆ పాపం నే నెందుకు మూట కట్టుకోవాలి? అనుకుని ఊరుకున్నాను.

గాలి పిల్ల. గాలికి పెరిగింది. జాలిపడి అన్నమ్మే దాన్ని పెంచింది. నేను దానితో మాట్లాడే వాణ్ణే కాదు. దగ్గరికొస్తే నాలుగు గుద్ది, కసిరి కొట్టి పంపేవాణ్ణి. చికాకు మొహంతో జాలిగా చూసేది. బిగ్గరగా కేకలు వేసే వాణ్ణి. నా బతుకులో దురదృష్టం ఆ రకంగా దాపరించిందని దాని మీద కసి పెంచుకున్నానే కాని, చంపుకోలేదు.

కొన్నేళ్ళు పోయాక, ''నీకేం వయసు మించిపోయిందిరా? ఎన్నాళ్ళని ఇట్లా ఒంటిగా ఏకాకిగా బతుకుతావు?'' అని నాకు రెండో పెళ్ళి చేశారు తెలిసిన నలుగురు.

నా రెండో పెళ్ళాం గంప గయ్యాళి. అది ఎందుకో తగని కసితో రగిలి పోయేది. ఆ కసినంతా ఆ పిల్ల దాని మీద చూపించేది. రోజూ ఏదో గొడవ. ఇంటికి రాగానే రగడ. ఎటూ తోచక పిల్ల దాని వీపు వాయించే వాణ్ణే. వెక్కి వెక్కి ఏడ్చేది. గుడ్లలో నీరు గుడ్లలోనే కుక్కు కునేది.

చాటుమాటున అన్నమ్మ మొత్తుకునేది. ''ఒరే, బాబూ! ఇది పాపంరా. నీ పెళ్ళాం ఆ పిల్లదాన్ని రాచి రంపాన పెడుతోంది. నేను చూడలేకపోతున్నాను. ఎంత కాదనుకున్నా, అది నీ రక్తం పంచుకుని పుట్టిన జీవుడురా. అభం, శుభం తెలీని పసి బిడ్డరా. పొద్దు గూకులూ దాన్ని గొడ్డు చాకిరీతో చంపుతోంది. ఎంత చేసినా మెప్పు లేదు. పైగా తిట్లూ, చీవాట్లూ. ఇది అన్యాయంరా. ఏ నాడయినా అది ఇంత తింటోందో లేక పస్తులుంటోందో కనుక్కుంటున్నావా?'' అనేది అన్నమ్మ, గునుగునగా.

నా గుండెలో చలనం కలిగేది. అదీ కొన్ని క్షణాలు మాత్రమే. చిత్రంగా దాని మొహం చూడగానే నాలో ఎక్కడ లేని కోపం పుట్టుకుని వచ్చేది.

చినిగిన చింకి పాతలు వేసుకుని అది ఒక ముష్టి పిల్ల లాగ ఇంట్లో చాకిరీ చేసి, గొడ్డు లాగ దెబ్బలు తిని పడి ఉండేది.

నాకు తెలుసు— నేను దాన్ని ఏ నాడూ రక్తం పంచుకున్న బిడ్డ [illegible] దగ్గరికి [illegible] [illegible]. అయినా, అది [illegible] నమ్ముకుంది.

అవకాశం దొరికినప్పుడల్లా అది నా మీద అభిమానం వ్యక్తం చేయటానికి ప్రయత్నించేది. నేనే గమనింపు లేక పశువు లాగ నడిచాను.

నాకు అంతా తెలుసు— అది ఆ ఇంట్లో నరకయాతన అనుభవించింది. భూదేవి లాగ అన్నీ భరిస్తూనే బతికింది. అంతా తెలిసే ఏమాత్రం జాలి, దయ లేక రాక్షసపు ముండాకొడుకు లాగ నేను ఏమీ పట్టించుకో లేదు. పైగా దాన్ని రాచి రంపాన పెట్టటానికే నేనూ నా శాయశక్తులా ప్రయత్నించాను.

నా కూతురు మొండిగా బతికింది. బండలా పెరిగింది. మాను లాగ మనుగడ సాగించింది నా కూతురు. పెరిగి పెళ్ళీడు కొచ్చింది. దానికి పెళ్ళి చేసి పంపించా లన్న ఆలోచనే లేదు. అది పోతే ఇంటి చాకిరీ ఎవడు చేస్తాడన్న బెంగ పట్టుకుంది నా పెళ్ళానికి.

నేను చూశాను. ఇది ఎవడో జులాయి వెధవతో వెధవ వేషాలు వేస్తోంది. ఇక సహించేది లేదు. ఇది ఈ ఇంట్లో ఒక్క క్షణం ఉండటానికి లేదు. పో. బయటికి పో'' అంటూ అరిచింది నా భార్య, కసిగా. దాని కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

''నిజమేనా? !'' అంటూ గర్జించాను.

నా రక్తం సలసల మరిగిపోతూ ఉంది.

''నాన్నా!'' అంటూ ఆక్రోశించింది. దీనాలాపం చేసింది. జాలిగా చూసింది నా కూతురు.

''నా తప్పేం లేదు, నాన్నా. నేనే పాపం ఎరగను'' అంది.

''అబద్ధా లెందుకే, రంకుదానా!'' అంటూ విజృంభించింది నా భార్య. కోపంతో నా కూతుర్ని జుట్టు పట్టుకుని

ముసలాడు ఆగాడు.

'పాపిష్ఠి ముండా కొడకా! ఎంత దారుణప్పనులు చేశావు!' అంటూ కసిదీరా తిట్టాడు రంగడు.

అంకయ్య కళ్ళు నీళ్ళు పెట్టుకుని ముక్కు చీదుకున్నాడు.

'ఇంతేగాదురా. ఇంతకంటే దారుణప్పనులూ జరుగుతూ ఉంటాయి, ఈ లోకంలో. ఆడది దేవత. దాని పాలిట రాక్షసుడు ఈ మగవాడు. ఎన్నెన్ని దారుణాలు జరిగినా, అన్నీ భరించి ఈ మగ వాణ్ణి క్షమించటం ఆడమనిషి సహజ లక్షణం. అది భూదేవి. ప్రపంచానికి మాత. అందుకే ఈ ప్రపంచం ఇట్టా నిలబడి ఉంది' అన్నాడు అంకయ్య సాలోచనగా.

'నమ్మమంటావా?' అనుమానంగా అన్నాడు రంగడు.

'విను, మరి. నువ్వు ఏంటావా, మావా!?'

కొత్తలో అంతా బాగానే ఉండేది.

యౌవనపు తొలి బులుపు తీరాక నా మనసులో వెర్రి ఆలోచనలు తల ఎత్తాయి.

నేను తాడు, బొంగరం లేని వాణ్ణి. వెనక, ముందు ఎవరూ లేరు. సంసారం సాగించటానికి లారీ తోలాను. కష్టపడి సంపాదించాను. కొంతకాలం అంతా బాగానే ఉంది కాని, తరవాత తరవాత అదంటే నాకు అసహ్యం పుట్టింది. ఇంత కురూపిని నే నెలాగ ప్రేమించానా అనిపించింది. తనే నన్ను వలలో వేసుకుని నా జీవితానికి గుదిబండలాగ అయింది అనుకున్నాను.

ఆ ఆలోచన పెరిగి పెరిగి బలంగా అయింది. కసి, ద్వేషం పెరిగాయి. కోపం వస్తోంది. పద్ధతి మారింది. ఇంటికి వెళ్ళటం తగ్గించాను. పాపం! నా కోసం అది అన్నం మాని ఎదురుచూస్తూ ఉంటుంది. ఆశలన్నీ నామీదే నిలుపుకుని,

# [illegible]

. . అందుకే ఆ ఆలోచన ఏదన్నా తెస్తే కస్సు బుస్సు మనేది. ఆ రోజల్లా దద్దోయాగం చేసేది. ఇంట్లో యుద్ధాన్ని తెచ్చి పెట్టేది. ఆ మాట అన్న వాళ్ళని కాకిలా పొడిచి తరిమి కొట్టేది. మహాకాళి లాగ నా మీద పడేది. నాలో అసహనాన్ని రగిల్చేది. నన్ను రాక్షసుడుగా మార్చే సేది. ఆ కోపతాపాలన్నీ ఆ పిల్ల దాని మీదుగానే నడిచి పోయేవి.

తలుచుకుంటే అంతా ఒక పీడ కల లాగ అనిపిస్తుంది. ఘోరం అనిపిస్తుంది. పాపం గాదా అని గుండెలు కలుక్కు మంటాయి. ఆ పాపం వెంటాడి నన్ను కబళించదా అని భయం వేస్తుంది. చేజేతులా చేసిన కర్మఫలం వెంటాడి నన్ను వదలటం లేదు గదా అని నా మీద నాకే జాలి కలుగుతుంది.

ఒక రోజు అర్ధరాత్రి జోరున వర్షం కురుస్తూ ఉంది. పెత్తనాలు ముగించి నేను అప్పుడే ఇల్లు చేరాను. ఆ సమయంలో ఇంట్లో గొడవ చెలరేగుతూ ఉంది. నా కూతురు ఏడుస్తూ ఉంది. దాన్ని జుట్టు పట్టుకుని బయటికి ఈడుస్తూ ఉంది నా భార్య.

''ఏమిటి? ఏమయింది?'' అన్నాను అసహనంగా. నాలో కోపం చెలరేగుతూ ఉంది.

''నాన్నా! నాన్నా!'' అంటూ ఆర్తనాదం చేసింది కూతురు. నా భార్య ఘోరంగా గర్జించింది. ''నా కళ్ళతో

బరబర లాగుతూ బయటికి ఈడ్చి, భళ్ళున తలుపు వేసింది. అంతా చూస్తూ పళ్ళు పటపట కొరుకుతూ ఉండి పోయాను నేను. అంతే. అలాగ బలవంతాన దాన్ని బయటికి తరిమేశాను. మరల కనబడలేదు. జోరున కురుస్తున్న ఆ వానలో బయటికి ఈడవబడి ఆ అర్ధరాత్రి అది ఏమయిందో, గాలికి కొట్టుకుని పోయిందో, ఏ నూతిలో నన్నా పడి చచ్చి పోయిందో, మరేమయిందో పట్టించు కోనే లేదు. ఆ పాపం ఇప్పుడు ముసలి తనంలో నన్ను వెంటాడుతోందని అనిపిస్తుంది. ముసలి వాణ్ణయి కాళ్ళూ చేతులూ చచ్చు పడిపోయి, కాలే కడుపుతో, వణికే శరీరంతో, దిక్కు మొక్కు లేక ఇలాగ ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళు బతకాలో, ఎన్నెన్ని అవస్థలు అనుభవించాలో అనుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. తొందరగా ఆ భగవంతుడు నన్ను తన దగ్గరికి తీసుకెళితే బాగుండు ననుకుంటాను. కాని, చేసిన పాపాలకి శిక్ష అనుభవించటం పూర్తి కాకుండానే అంతటి అదృష్టాన్ని అందుకోవటం సులువు కాదు గందా!'

**పాలడుగు వెంకటేశ్వరరావు**

తల ఊపాడు ముసలాడు.

'అప్పుడు నేను మంచి యౌవనంలో బలిసిన గిత్తలాగ ఉండేవాణ్ణి. నా కన్ను ఒక పిల్లమీద పడింది. అది అమాయకురాలు. అందగత్తె కాదు. కాని, మంచి యౌవనంలో ఉంది, నన్ను ఆకర్షించింది. నేను చుట్టపుచూపుగా అప్పుడు ఆ ఊరు వెళ్ళి ఆ పిల్లచేత ఆకర్షింప బడ్డాను. ఆ పిల్లదాన్ని ఆకర్షించాలని నానారకాల ప్రయత్నాలు చేశాను. కాని, అవి ఫలించలేదు. చివరికి ఆ రోజే నేను మా ఊరు తిరిగి వెళ్ళిపోతానగా అవకాశం చిక్కింది. ఆ అవకాశం అంది పుచ్చుకొని ఆమెతో మాటలు కలిపాను. అమాయకంగా చూసింది. నా మాటలతో ఆమెని వలలో వేసుకోవటానికి ప్రయత్నించాను. అంతలో ఎవరో అటు వచ్చారు. పిరికివాడి వలె పారిపోయాను.

ఆ రాత్రే నేను మా ఊరు పోవటానికి సంచీ పుచ్చుకొని రైలు స్టేషన్‌కి వెళుతూంటే దారిలో ఆమె కనిపించింది. ఆమె ఏడుస్తూ ఉంది. మొహం ఉబ్బి ఉంది. జుట్టు చిందరవందరగా ఉంది. పలకరించాను. నాలో కోరిక చెలరేగింది. మాయమాటలు చెప్పాను. ఆమెని నా వెంట తీసుకుని పోయాను. మా ఊరు వెళ్ళాక మా పెళ్ళి జరిగింది.

గిన్నెలో అన్నంపెట్టి చూస్తూ ఉంటుంది. నాకు తెలుసు. నన్నే నమ్ముకున్న అమాయకపు జీవి అది. అయినా, అదంటే నాలో ఎంత కసి, పగ!

అందుకే కావాలని ఇంటి కెళ్ళడం మానేశాను.

నాతో బ్రతుకు పంచుకుని సుఖంగా గడిపింది అది, ఏ నెల రోజులో. అంతే. నెల కోసారి తప్పదని ఇంటికి వెళ్ళేవాణ్ణి. అది ఎట్లా ఉందో, ఏ రకంగా సంసారం సాగిస్తూ ఉందో పట్టించుకోలేదు.

నానాటికి నా గుండె బండబారింది. కసి కరుడు గట్టింది. ద్వేషం పెరిగింది.

''ఇన్నాళ్ళూ ఇంటికి రాలేదు! ఏమయింది?'' అని అడిగేది అది, అమాయకంగా చూస్తూ. చిరుబురులాడేవాణ్ణి. ''ఇంట్లో కూర్చొని రాణీలాగా కులుకుతున్నావు. బయట కెళ్ళిన మగవాడు ఎన్ని బాధలు పడాలో నీకేం తెలుసు?'' అని విసుక్కునేవాణ్ణి. విదిలించికొట్టే వాణ్ణి. అది న్యాయం గాదని నాకు తెలుసు. తెలిసినా, అన్యాయపు దారుల వెంటే నడవాలన్న ప్రయత్నమే చేసేవాణ్ణి.

రాను రాను నా అసహ్యం పెచ్చు పెరిగింది. అప్పుడప్పుడు ఆమెని కొట్టి నా కసి తీర్చుకోవటం మొదలుపెట్టాను. కసి, ద్వేషం--- కారణం ఏమిటి అన్న ప్రశ్న వచ్చేది. నా మెడకి తగులుకొని గుదిబండలా తయారవటమే అది చేసిన నేరం అని సరిపుచ్చుకొనే వాణ్ణి.



నివేదన — చిత్రం—ఎమ్. సీతాలక్ష్మి (నర్సీపట్నం)

పిచ్చిది. నేనంటే ఎంతో ప్రేమగా ఉండేది. దేవుణ్ణిలా కొలుచుకొనేది. అను రాగం పంచి ఇవ్వటానికి ప్రయత్నించేది. అన్నీ రాక్షసంగా తోసిపుచ్చాను. చేజేతులా విసిరికొట్టాను. అన్నీ భరించింది. నవ్వుతూ నాకు సపర్యలు చేసి, నా కోపం పోగొట్టటానికి చూసింది.

ఆమె ప్రవర్తన నా బలహీనతని మరింత పెంచింది. అదే ఏ గంప గయ్యాళో అయితే ఎలాంటి మార్పులు వచ్చేవో నాకు తెలుసు. కాని, అది గంగి గోవు. అందుకే నా అహంభావానికి అడ్డు లేకుండా పోయింది. దుష్టత్వం నానాటికి పెరిగింది.

మదించిన తుమ్మెద లాగ బజారు పూల వెంట పడ్డాను. అప్పుడప్పుడు కొన్ని "చిలకల్ని" ఇంటికి తీసుకువచ్చే వాణ్ణి. మంచం ఎక్కి కూర్చుని నవ్వు ల్లాడుతూ నాతోబాటు వాళ్ళకి కూడా ఆమెచేత అన్ని రకాల సేవలూ చేయిం చాను.

నాకు తెలుసు— అది పాపమని.

అటువంటి పాపపు పనులు చేసి కసి తీర్చుకోవటమే నా ధ్యేయంగా పెట్టు కున్నాను. అదే నా ప్రయత్నం. దాన్ని సాధించటమే నా లక్ష్యం.

అన్నీ సహించింది అది. భూదేవి లాగ భరించింది.

సహనంతోనే నడిచింది, ముళ్ళబాట వంటి బ్రతుకులో. అడుగులో అడుగేసి నడిచింది.

నా పిచ్చి పను లన్నింటినీ భరించింది, ఎన్ని రకాలుగా సాధించినా, పీడించినా కూడా. అయినా నా కసి తీరలేదు. ఆ కసి నానాటికి పెరిగింది.

పీక పిసికి చంపేసి పీడ వదుల్చుకుందా మనుకున్నాను. కాని, అప్పటికే అది నిండు చూలాలు. చేతులు రాలేదు. ప్రయత్నించి నా వలన కాలేదు. ఎంతో ఆలోచించాను.

చివరికి ఒక నిర్ణయానికి వచ్చాను.

ఆ రోజు అప్పుడే అమలాపురం నించి వచ్చి లారీ దిగాను. నేరుగా ఇంటికి వెళ్ళి దానితో— "నిన్ను వదిలేస్తున్నాను. ఇక నాకు, నీకు ఏం సంబంధం లేదు" అని చెప్పి వచ్చేయా లనుకున్నాను. ఒక రంగుల చిలకని పట్టుకుని అప్పటికే నా దారి నేను ఏర్పరుచుకున్నాను.

జోరున వర్షం పడుతూ ఉంది. తళతళ మెరిసి, ఫెళఫెళ ఉరుములు పడుతున్నాయి. ఆ వర్షంలోనే వెళ్ళాను. దగ్గరగా ఉన్న తలుపు తోసి గుమ్మంలోనే నిలబడ్డాను. దానితో ఆ మాట చెప్పి పోవాలనే ప్రయత్నం. అంతలో — కేరుమంటూ ఏడుపు వినిపించింది. పాప పుట్టింది! నేను తండ్రి నయాను!! నా గుండెలో సంబరం. నా మనస్సు లాగింది. పాపం అనిపించింది.

అటు, ఇటు ఊగులాడింది గుండె. కాని, వెంటనే రాయిలాగ అయింది.

కొన్ని క్షణాల్లోనే నిర్ణయానికి వచ్చి గిర్రున వెనుదిరిగాను. వెళ్ళిపోయాను. అంతే. బంధం పుటుక్కున తెంపుకున్నాను. మరల ఆ వాయలకే పోలేదు. ఆ ఊరు మొహం చూడలేదు. నమ్ముకున్న భార్యని గాలికి వదిలేశాను. ఏమయిపోయిందో?

తెలిసీ చేతులారా అన్యాయం చేశాను. అలాగ జరిగింది.

కాని, ఈ వ్యామోహం ఎన్నాళ్ళో నిలవదు. శరీరం పుచ్చిపోతుంది. వయసు మీద పడివాక పక్షవాతం వచ్చి నా కాలూ, చెయ్యీ పడిపోయాయి. అనాథుణ్ణి అయాను. ఇప్పుడనిపిస్తుంది — నా భార్యాబిడ్డలే కూడా ఉంటే ఇప్పుడు అనాథ అయిన పక్షిలా పడి ఉండే అవసరం ఉండేది కాదు గదా— అని.

ఏమనిపించీ ఏం లాభం?

నా పాపమే నా వెంట పడింది.

అనుభవిస్తున్నాను.

ఆడది దేవత. ఆ దేవతకి అన్యాయం జరిగితే దైవం చూస్తూ ఊరుకోడు. వెంటాడి కసి తీర్చుకుంటాడు. తప్పదు.

వయసులో ఉన్నప్పుడు కన్నూ మిన్నూ కానక వడుస్తాము. ఆలోచన ఉండదు. పాపపుణ్యాల భీతి ఉండదు. దయా దాక్షిణ్యమూ అంటే చీదరించుకుంటాము. కాని, అవి ఉన్నాయి. ఉంటాయి. అవే లేక పోయిన నాడు ఈ ప్రపంచం ఈ రకంగా నయినా నడవదుగాక నడవదు.

ఏది ఏమయినా, నీ లాగే నేను కూడా ఒక ఆడదానికి తీరని ద్రోహం చేశానురా, మావా! అందుకే ఇప్పుడు ఆ పాపం కట్టి కుడుపుతూ ఉంటే అనుభవించలేక అవస్థపడుతున్నాము. అయినా, తప్పదు. రాసిపెట్టి ఉన్నంతకాలం ఈ అవిటి బ్రతుకులు ఇలాగ సాగిపోవలసిందే. కాలే కడుపుల్ని, కారే కన్నీళ్ళని, గుండెల్ని పిండేసే జ్ఞాపకాల్ని అన్నిటినీ భరిస్తూ మనం బ్రతుకుల్ని వెళ్ళదీయక తప్పదు గాక తప్పదు మరి!'

అంకయ్య ఆగి, నిట్టూర్చాడు.

ముసలాడు తల ఊపి గాఢంగా నిశ్వసించాడు.

కాని, రంగడు వలవల ఏడ్చేశాడు. గొల్లుమన్నాడు.

'ఒరేయ్! ఒర్నీ...గుడ్డోడా? ఏంట్రా ఏడుస్తున్నావు?' అంటూ అదుర్దాగా అడిగాడు అంకయ్య.

'పిచ్చి నాయాల! ఎందుకురా ఏడుపు? ఏమయిందిరా నీకు?' అంటూ ఓదార్చ బోయాడు ముసలాడు.

'ఒరి మిమ్మల్ని తగలెయ్యా! ఇన్ని మాటలు చెప్పి ఏడిపించి, పైగా అదేంటని అడుగుతున్నారా? ఇంతకీ మీరు చెప్పిన దంతా నిజమేనా? నమ్మమంటారా?' అన్నాడు రంగడు, బొంగురు గొంతుకతో.

'ముమ్మాటికీ నిజమేరా. కాదంటే నెత్తిని చెయ్యి పెట్టుకుంటాను' అన్నాడు అంకయ్య.

'ఈ వయసులో, పండిన పాపపు బ్రతుకు నెత్తిన పెట్టుకుని నేను ఇంకా అబద్ధాలు ఆడతానని ఎట్టా అనుకున్నావురా?' అని లబలబలాడాడు ముసలాడు.

'అయితే, దేవతలాంటి ఆడదానికి అన్యాయం చేస్తే అది ఊరికే పోదంటారు.'

'అది ముమ్మాటికీ నిజంరా. ఆడదాని మంచిని, ప్రేమని ఇష్టాగ వాడుకుని పాపపు పనులు చెయ్యబట్టే మా బ్రతుకులు ఇట్టా అయాయి. ఇది పచ్చినిజం. నమ్మరా, బాబూ!'

'నమ్ముతాను. అయితే, నేను కళ్ళు లేని కబోదిని అయి రెక్కలూడిపోయిన పక్షిలాగ అవటానికి నేను చేసిన ఘోరాతి ఘోరమే కారణమని నేనూ నోరెత్తి బిగ్గరగా చెపుతాను. వింటారా?'

'వింటాం గాని, ఇంత చిన్న వయస్సులో నువ్వు కూడా ఒక పాపం చేశావటరా, రంగడూ?!'

'చేశాను గనకే అనుభవిస్తున్నాను. మరి వినండి' అంటూ కళ్ళు తుడుచుకున్నాడు రంగడు.

ముసలాడు సర్దుకుని కూర్చున్నాడు.

అంకయ్య ఆలోచనలో పడి చెవు లప్పగించాడు.

మూలని ముసుగెట్టిన ఆకారం కదిలింది. ఆ ముసుగులోనించి సన్నగా వెక్కిళ్ళు వినవచ్చాయి గాని, గాలిహోరులో ఆ వెక్కిళ్ళు ఎవరికీ వినబడకుండా పోయాయి.

ఆ గాలి హోరుని చీల్చుకుని రంగడి గొంతు వినిపించింది.

'''తల్లే దైవము. ఆ దైవాన్ని పూజింపుము'' అని నా చిన్నప్పుడు బళ్ళో చదువుకున్నాను. కాని, ఆ మాటలు నా మనసుకి ఎక్కలేదు.

నవ మాసాలు మోసి, కని, పెంచింది నన్ను, నా తల్లి. నా మీదే ఆశల్ని నిలుపుకుని బ్రతికింది. నా సుఖంకోసం తన సుఖాన్ని బలి పెట్టింది. నన్ను కన్నుల్లో నిలుపుకుని పెద్దవాణ్ణి చేసింది.

ఆమెకి ఎవరూ లేరు, నేను తప్ప.

ఆమెకి నేనూ, నాకు ఆమే.

నాకు తెలుసు — నాకోసం ఆమె పడరాని పాట్లు పడింది. ఎన్నో కష్టా అనుభవించింది. నన్ను కన్నుల్లో పెట్టుకుని పెంచి పెద్దవాణ్ణి చేసింది.



ఆటువంటి నా కన్నతల్లిని నేను నెత్తిన పెట్టుకుని పూజించాలి. తల్లి ఋణం కావాలన్నా తీర్చుకొనేది కాదు.

నా తల్లి దేవత. సహనానికి ఆమె భూదేవి. ప్రేమమూర్తి. నా గురించి ఎన్నో బాధలు భరించి, నా కోసమే ఆమె ముళ్ళబాట వెంట పయనించింది. నా మీదనే ప్రాణాలు పెట్టుకుని బ్రతికింది.

నన్ను పెద్దవాణ్ణి చేసి, ప్రయోజకుణ్ణిగా మార్చి మురిసిపోవాలని కలలుకంది. తన కడుపు కట్టుకొని నాకు ఏ లోటూ రాకుండా జరుగుబాటు కావాలని ఎంతో శ్రమపడింది. ఎంతో కష్టపడి నాకు చదువు చెప్పించి ప్రయోజకుణ్ణి చెయ్యాలనుకుంది. ఇదంతా నా అనుభవం. దాన్నుంచి నేనే ఏమీ నేర్చుకోలేక పోయాను.

ఇప్పు డాలోచిస్తే అనిపిస్తుంది— నేను ఎంత గుడ్డివాడిని అయిపోయాను! అందుకే భగవంతుడు నా రెండు కళ్ళూ తీసేసుకున్నాడా?!

వయస్సు వచ్చి మనసు పెరగవలసిన ఆ సమయంలో నాలో అహానం ఎలా తొంగిచూసింది?! చికాకులో, చిడిముడిపాటులో ఆమె ప్రేమని, అనురాగాన్ని ఎలా విదిలించికొట్టాను! నేను అలా పిచ్చి వేషాలు వేసినా, భరించిన ఆమెలోని సహనశక్తి ఎంత గొప్పది!

చదువులేని మూర్ఖుణ్ణి కాదే!

నాకోసం, నాచదువుకోసం ఆమె ఎన్ని కష్టాలు పడింది!

ఆ చదువూ తిన్నగా సాగించక ఆమెని ఎన్ని అవస్థలు పెట్టానో నా అవివేకంతో, అజ్ఞానంతో ఆమెకి ఎంత ఆవేదన కలిగించాను!

శాశ్వతమైన విలువల్ని విస్మరించి, చచ్చుపుచ్చు ఆకర్షణల్లో పడి నేను ఎన్ని వెర్రి మొర్రి వేషాలు వేశాను!

బాధ్యతల్ని త్రోసిరాజని జీవితాన్ని పక్కదారుల వెంట పోనిచ్చి ఎంత తప్పు పని చేశాను!' రంగడు ఆగాడు. అతని గొంతు బొంగురుపోయింది.

'ఓరి నాయినా!! నీ మాటలు నాకు అర్థం కావటం లేదు. అసలు ఏం జరిగిందో తిన్నగా చెప్పరాదా?' అని మొత్తుకున్నాడు ముసలాడు.

'చెపుతాను, ముసలాడా, విను. నువ్వు నీ కూతుర్ని అన్యాయం చేశావు. అంకయ్య తన భార్యని నట్టేటముంచాడు. నేను అంతకంటె పెద్ద ఘోరం చేశాను. నా తల్లిని కర్కశంగా వదిలేశాను, నేను. గొప్ప పాపం జరిగింది.

నా తల్లి దేవత.

ఆ దేవత తన గుండెలోంచి అమృతం వెలికి తీసి, ఆ అమృతంతో నన్ను పెంచింది కాని, నేను రాక్షసుణ్ణి. ఆ అమృతం నాలోని రాక్షసత్వాన్నే పెంచింది.'

'అదిగో మళ్ళీ మొదలా? తిన్నగా చెప్పరాదా?' ముసలాడు అన్నాడు.

ఏడుపులోను రంగడికి నవ్వు వచ్చింది.

'సర్లే, విను. నా తల్లి నన్ను అల్లారుముద్దుగా పెంచింది. నానా కష్టాలూ పడి పెంచి నన్ను పెద్దవాణ్ణి చేసింది. ముసలితనంలో కొడుకు కొండంత అండగా ఉంటాడు గదా అని ఆశించింది. నా పెళ్ళి చేసింది. కోడల్ని తెచ్చుకుంది. ఆ కోడలు కులుకుల వయ్యారి. కోపానికి సత్యభామ.

ఆ సత్యభామకి అమ్మ పొడ గిట్టలేదు. అది దాని తత్త్వం. అకారణంగానే నా భార్య ఆమెని చీదరించుకుంది. అసహ్యం వెలిబుచ్చింది. వాటన్నిటినీ అమ్మ నా కోసమే భరించింది. ఒక సారి అమ్మకి మశూచి వచ్చింది. మంచంమీదే అమ్మ నానా అవస్థా పడింది. ఆ పరిస్థితిలో నా భార్య పుట్టింటికి ప్రయాణం పెట్టుకొంది. నన్నూ రమ్మని పట్టుపట్టింది. నా మనసు వదిలి నన్ను లొంగదీసింది!

ఆ స్థితిలో అమ్మని వదిలి నేను ఎలా వెళ్ళను?

ఆ రాత్రి వర్షం కుండపోతగా కురుస్తూ ఉంది. అమ్మ మూసిన కన్ను తెరవక పడి ఉంది. అమ్మని వదిలేసి వెళ్ళాను, సత్యభామ చెంగు పట్టుకొని. అమ్మని నా భార్య అసహ్యించుకొనడంలో వింత లేదు. కాని, నా కేమయింది? నన్ను కని, పెంచి, అంతవాణ్ణి చేసేందుకు సర్వశక్తులూ ధారపోసి అలాగ జీర్ణ వస్త్రం లాగ అయింది నా తల్లి. నా కోస మనే కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని బ్రతికింది. నా గురించే తన సర్వస్వమూ త్యాగం చేసింది.

ఆ రోజు ఉదయమే నా తల్లి మీద విరుచుకుని పడింది నా భార్య. నానారకాలుగా తిట్టిపోసింది. అంతా వింటూ, చూస్తూ మూగవాడిలాగ, గుడ్డివాడిలాగ ఉండిపోయాను.

"ఈ చాకిరీ నేను చేయలేను. నావల్ల కాదు. పాపిష్టి ప్రాణం తొందరగా పోయినా బాగుండును" అంటూ ఎలుగెత్తి అరిచింది నా భార్య.

అంతా వింటూ, గుడ్లలోని నీరు కనుగుడ్లలోనే కుక్కుకుని దీనంగా చూసింది అమ్మ. ఆ చూపు నాలోని అహానాన్నే రేపింది. కాని, కొంతయినా జాలిని, దయని, ప్రేమని పుట్టించలేదు. చిరాకుగా బయటికి వెళ్ళిపోయాను.

రాత్రి నేను తిరిగి వచ్చేసరికి అన్నంత పనీ చేసింది నా భార్య.

ప్రయాణానికి అన్నీ సర్దుకొని సిద్ధంగా ఉంది.

"ఇప్పుడే, ఈ క్షణాన్నే బయలుదేరాలి. వస్తారా, లేదా?" అంటూ గొంతుమీద కూర్చుంది.

అమ్మ దగ్గరికి వెళ్ళి చూశాను.

మూసిన కన్ను తెరవకుండా పడి ఉంది అమ్మ. జ్వరంతో ఒళ్ళు సలసలమని మరిగిపోతూ ఉంది. శరీరమంతా నల్లగా బొబ్బలు పొంగి వచ్చాయి. "బాబూ! బాబూ!" అంటూ కలవరిస్తూ ఉంది అమ్మ. ఆ బాబు ఎవరో కాదు, నేనే.

ఆ క్షణంలో ఏ శక్తి నా మీద తన ప్రభావం చూపించిందో తెలియదు. అయోమయంగా అలాగే నిలబడిపోయిన నన్ను నా భార్య తొందర పెట్టింది.

"రండి, రండి. టైము లేదు" అంటూ చెయ్యి పట్టుకుని లాగింది నా భార్య. జోరున కురుస్తున్న ఆ వర్షంలోనే నా భార్య వెంట స్టేషనుకి వెళ్ళిపోయాను. ఆ పరిస్థితిలో అమ్మని ఒంటరిగా వదిలిపెట్టాను. మీరు నమ్మినా, నమ్మకపోయినా వాస్తవానికి జరిగింది అది.

ఆ పోవటం పోవటం మరల తిరిగి వచ్చేసరికి పదిహేను రోజులు పట్టింది. నా భార్య ఏం చెప్పిందో, ఏమో నా అత్తమామలు నన్ను కదలనీయ లేదు. ఏదో కారణం చెప్పి నన్ను వెంటనే తిరిగి రానీయలేదు. నేను తిరిగి ఇంటికి రాగానే ఆత్రంగా ఇంట్లోకి వచ్చి చూశాను.

నా గుండె గుభేలు మంది!

అమ్మ పడుకుని ఉండే ఆ మంచం ఖాళీగా ఉంది! ఇల్లు దుమ్ము కొట్టుకుని గలీజుగా ఉంది. పక్కవాళ్ళని అడిగాను. పక్కింటి పున్నయ్య నానా మాటలూ అన్నాడు నన్ను.

"నువ్వు మనిషి వేనా?" అన్నాడు. "నువ్వు మానవ జన్మ ఎత్తావా? కన్న తల్లిని అట్లా వదిలి భార్య రమ్మంది గదా అని అలా వెళ్ళి పోతావా? ఏం జన్మ నీది? రేపు వయసు మీద పడినాక నీ కొడుకు నీకు అట్లాగే చేస్తే నీకే ఎట్లా ఉంటుంది?" అని అడిగాడు. ఖాండ్రించి ఉమ్మాడు.

కళ్ళ వెంట నీరు పెట్టుకున్నాను. పొరపాటు జరిగిందని బతిమాలాను. మా అమ్మ ఎక్కడుందో చెప్పమని అడిగాను.

"ఇంకెక్కడి అమ్మ? !" అన్నాడు.

నా గుండె దడదడ లాడింది.

"ఆవిడ అవస్థ చూడలేక నేనే వెళ్ళి సన్యాసి ఆశ్రమం హాస్పిటల్ వాళ్ళకి చెప్పాను. మర్నాడే వాళ్ళు వచ్చి ఆమెని వానులో తీసుకు పోయారు" అన్నాడు.

"ఏ హాస్పిటలు?" అని అడిగాను.

"ఏమో, నా కేం తెలుసు?" అని చీదరించుకున్నాడు. విదిలించి కొట్టాడు. పున్నయ్య అసలే తిక్కవాడు.

ఊళ్ళో హాస్పిటల్సు అన్నీ తిరిగి విచారించాను. ఎక్కడా అమ్మ సంగతి తెలియలేదు. ఆ సమయంలో ఊళ్ళో ఎందరికో మశూచి తగిలిందట. ఎందర్నో తీసుకు వెళ్ళి హాస్పిటల్లో వైద్యం చేశారట. చాలా మంది పోయారట. కొద్ది మంది బతికి బయట పడితే వాళ్ళని వెంటనే డిస్చార్జి చేసి పంపించేశా రట. అమ్మ ఏమయిందో తెలియదు. బతికి బట్టకడుతూ ఉందో లేక నూకలు చెల్లి వెళ్ళిపోయిందో? స్వార్థమే నా నోరు నొక్కేసింది. నా మనసు చచ్చిపోయింది. అమ్మని నా చేతులారా నేనే చంపుకున్నాను. నేను రాక్షసుణ్ణి గనకే నా తల్లిని చేతులారా నేనే చంపుకున్నాను. ఆ పాపమే నన్ను వెంటాడింది. సంవత్సరమయినా తిరగలేదు— ఆ రోజు నేను నా భార్యతో బజారుకి వెళ్ళి వస్తున్నాను. ఆమె విలాసంగా కబుర్లు చెబుతూంది. నేను వింటున్నాను. కబుర్లలో పడి మేము రోడ్డు మధ్యలోకే వచ్చాము. అంతలోనే ఆ మలుపులో స్పీడుగా వచ్చిన లారీ మా మీదికి వచ్చింది. అంతా క్షణాలలో జరిగిపోయింది. నా భార్య అక్కడి కక్కడే చనిపోయింది. కొన్ని నెలలు హాస్పిటల్లో ఉన్నాక కళ్ళు పోగొట్టుకుని నేను బతికి బయటపడ్డాను. దిక్కు లేని పక్షిలాగ మిగిలి పోయాను. నా గతి ఇలాగ అయింది. అమ్మ బతికి ఉంటే ఇప్పు డీ గతి పట్టేదా?!. . .'

రంగడు ఆపాడు. వెక్కి వెక్కి ఏడ్చాడు.

'ఊరుక్కోరా, రంగడూ!' అంటూ ఓదార్చాడు అంకయ్య. పెదాలు కసిగా కొరుక్కున్నాడు ముసలాడు. ఆ తరవాత ఎవరూ మాట్లాడలేదు.

బయట గాలి ఉధృత మయింది. వాన జోరు ఎక్కువయింది. లోతుకు పోయిన ముగ్గురి కడుపు ల్లోను పేగులు గుడ గుడ మన్నాయి.

'అవునూ, ఈ పిచ్చమ్మ ఇంకా రాలేదేం?' అంటూ గొణిగాడు ముసలాడు.

'నిజమే. ఏం గాలి? ఏం వాన? ఈ పిచ్చిది ఈ గాలివానలో ఎటు కొట్టుకుపోయిందో? ఎట్లాగయినా అది వచ్చి ఇంత ముద్ద దొరికితే బాగుండును' అన్నాడు అంకయ్య.

రంగడు ఏడుపు నాపుకుని, కళ్ళు తుడుచుకుని తనూ ఏదో సణిగాడు, ఆకలిగా.

బయట గాలి హోరుమంటూ ఉంది.

వాళ్ళ కడుపుల్లోని ఆకలి హోరు ఇంకా భయంకరంగా ఉంది. మూలను ముసుగు లోని ఆ ఆకారం లేచింది. మొహం తుడుచుకుని ఊగుతూ బయటికి నడిచింది. దుఃఖంలో, ఆకలిలో వాళ్ళు అది గమనించనే లేదు.

చినుకు పెద్ద దయింది. ఆకాశం నల్లగా అయి భూమి మీద చీకట్లు తెచ్చి పెట్టింది. సాయంత్రానికే రాత్రయిన ట్లనిపించింది.

"నాకూ, వయసు మీద పడింది. శరీరం జీర్ణ మయింది. జుట్టూడింది. మశూచికం పోసి నా అవతారమే మారి పోయింది. అందుకే వాళ్ళు నన్ను గుర్తించ లేకపోయారు. పోనీ, ఇందులో పోయిం దేముంది? కాని, ఒంట్లో సత్తువ లేదు గద? మూడు రోజు ల్నించి జ్వరం కాసినా ఒళ్ళు తూలిపోతూంది. కాళ్ళు వణుకుతున్నాయి. ఏం చెయ్యను? అయితేనేం గాక? వాళ్ళు ఎవరు? నా తండ్రి, నా భర్త, నా కొడుకు. దిక్కు లేని పక్షుల్లాగ కడుపులు లోతుకు పోయి ఆకలితో నకనక లాడు తున్నారు. చూస్తూ ఎట్లా పడుకుని ఉండేది? ఆ భగవంతుడు ఇంకా నా కాలూ, చెయ్యీ, చూపూ బాగా ఉంచింది మరెందుకు? వాళ్ళ కోసమని అయినా నేను కొంత కష్టపడలేనా? ఏ చల్లని తల్లి అయినా దయ దలిచి ఇంత విదిలిస్తే వాళ్ళు ఆకలిని తీర్చుకుంటారు గదా?" అని ఆలోచించుకుంటూ, లేని ఓపికని తెచ్చుకుని, వర్షంలో తడుస్తూ, గాలిని చీల్చుకుంటూ నడిచింది ఊగుతూ, తూగుతూ పిచ్చమ్మ.

'అమ్మా, అన్నపూర్ణమ్మ తల్లీ!! మాదా కబళం, తల్లీ! ఆకలికి చచ్చి పోతన్నాను. ఇంత అన్నం వెయ్యి, తల్లీ!' అన్న పిచ్చమ్మ కేకలు వణుకుతూ గాలిని చీల్చుకుంటూ వచ్చాయి.

ఊరు మునగ దీసుకుని ఉంది. చీకటి పడుతూ ఉంది.

ఇళ్ళలో జనం ఇళ్ళలో ఉన్నారు. తలుపులు వేసి ఉన్నాయి.

ఊళ్ళో బజార్లన్నీ తిరిగింది పిచ్చమ్మ. ఏ తల్లీ తలుపన్నా తీయలేదు.

చివరికి ఒక తల్లి తలుపు తీసి, ఇంత ముద్ద వేసింది. దాన్నే పదిలంగా మూట కట్టుకుని సత్రం వైపు వడివడిగా అడుగులు వేసింది పిచ్చమ్మ.


బయట చలి శరీరాన్ని గజగజ వణికించింది.

లోపలి జ్వరం సలసల మంట. రక్తాన్ని మరిగించింది.

నీరసానికి అడుగులు తూలి పడ్డాయి.

లేని బలాన్ని ఎరువు తెచ్చుకుని సత్రం చేరింది పిచ్చమ్మ. ఆకలితో నకనక లాడుతూ, తోక ఊపుకుంటూ ఆశగా దగ్గరికి వచ్చింది సత్రం కుక్క బయటనే ఎదురై. 'ఛాయ్. పో. నీ జిమ్మడ!' అంటూ దాన్ని అదిలించి లోపలికి నడిచింది పిచ్చమ్మ. అయినా, అది లెక్క చెయ్యకుండా ఆమె వెనకే వెళ్ళింది.

పిచ్చమ్మ అడుగుల సవ్వడికి ఆ ముగ్గురూ ఆశగా చూశారు, తలలు తిప్పి.




'ఏయ్! ఎవరది? పిచ్చమ్మా!' అంటూ పలకరించాడు రంగడు.

'నేనే, బాబూ!' అంది పిచ్చమ్మ దయగా, జాలిగా, ప్రేమగా.

'ఇన్నాళ్ళ నుంచి ఏమయి పోయావే! మే మేమయి పోతా మనుకున్నావు? ఎక్కడెక్కడ తిరుగుతూ ఉండి పోయావు?' అంటూ నిష్ఠురంగా అన్నాడు అంకయ్య, ఆకలి కోపం తెచ్చుకుని.

'నువ్వు నిజంగా మనిషివే అయితే, అటువంటి పని చేసి ఉండవు' అంటూ కోపంగా అన్నాడు ముసలాడు, తీండ్రించి.

పిచ్చమ్మ కళ్ళ వెంట నీరు తిరిగింది.

'నాయనలారా! మూడు రోజుల్నించి ఒకటే జ్వరం నాకు. మందు లేదు. దారకం లేదు. ఈ మూలను చీకట్లో ముసుగెట్టి పడి ఉంటే నన్ను మీ రెవరూ కానలేదు. ఏం చెయ్యను? చివరికి మీ బాధ చూడలేకనే, లేచి వెళ్ళి వానలో, వంగిడిలో తిరిగి వచ్చాను. ఒక ముద్ద దొరికింది. అది తిని మీ ఆకలి చల్లార్చుకోండి' అందామని నోరు తెరవ బోయింది. కాని, పిచ్చమ్మ నోరు వణికింది. నీరసం ముంచుకుని వచ్చింది. శరీరం ఏమిటోలా అయి పోయింది!

'ఇంతకీ ఏమన్నా తెచ్చావా? లేదా మమ్మల్ని ఆకలికి మాడ్చి చంపటమే నీ ఉద్దేశ్యమా?' అంటూ దగ్గరికి వచ్చి పిచ్చమ్మ చేతి లోని మూటని ఆబగా అందుకున్నాడు ముసలాడు.

'ఓం, ముసిలి పీనుగా! అంతా నువ్వే కొట్టేద్దామనా? అదేం కుదర్దు' అంటూ తడుముకుంటూ దగ్గరికి వచ్చి ముసలాడి చేతి లోని మూటని లాక్కొని విసురుగా ముసలాణ్ణి తోశాడు రంగడు, హఠాత్తుగా.

'ఒరి, గుడ్డి నాయాలా! ఎంత బలంరా నీకు!' అని తిట్టుతూ ఆ ఊపుకి వెళ్ళి గోడకి గుద్దుకున్నాడు ముసలాడు.

'ఒరే, రంగా! ఏమిట్రా అది?' ఏమిట్రా?' అంటూ దేకుకుంటూ వచ్చి రంగడి చేతి లోని మూటని లాగాడు అంకయ్య.

ముగ్గురూ కాస్సేపు మూట కోసం పెనుగు లాడారు. తిట్టుకున్నారు. కొట్టుకున్నారు. కుక్కల్లాగ దెబ్బలాడు కున్నారు.

'ఒరే! ఆగండ్రా, పిచ్చి నాయాళ్ళ లారా! పోయిందిరా. పోయిందిరా!' అంటూ అరిచాడు ముసలాడు, కాస్సేపటికి.

'ఏంట్రా పోయింది నీ మొకం?'

'అన్నం మూటరా! ఆ మూటని ఎత్తుకు పోతూ ఉందిరా.'

'అయ్యో, అయ్యో! పట్టుకోండిరా. పట్టుకోండి.'

కుక్కని పట్టుకోబోయి ముసలాడు బోర్లా పడ్డాడు. రంగడు గోడకి గుద్దుకున్నాడు. అంకయ్య చేతులు అరిగి నెత్తురు వచ్చింది.

'అయ్యో, అయ్యో!' అంటూ వలవల ఏడ్చారు ముగ్గురూ. బూతులు తిట్టుకున్నారు. ఆకలితో అరుచుకున్నారు. చివరికి నోళ్ళు నొప్పెట్టి ఊరక ఉండి పోయారు. అలిసిపోయి ఈడిగిల బడ్డారు.

'అసలు తప్పంతా ఈ పిచ్చి ముండది. ఆ తెచ్చి చచ్చింది తనే తలా కాస్త పడేస్తే ఎంత బాగుండేది! ఎంత పని చేసింది— రాక్షసి!' అన్నాడు ముసలాడు కసిగా. ఆకలి ముసలాడి కసిని పెంచింది.

'ఏమే, పిచ్చమ్మా. నీకు బుద్ధి ఉందా అసలు? పిచ్చమ్మా. పిచ్చమ్మా!' రంగడు పిలిచి హితవు చెప్పబోయాడు పిచ్చమ్మకి.

'ఇంకెక్కడి పిచ్చమ్మరా? ! పిచ్చమ్మ పోయింది. ఇక ఏడిచి చావండి, దొంగ నాయాళ్ళలారా. బుద్ధి లేని కుక్కల్లారా' అని అరిచాడు అంకయ్య. అప్పటికే కింద పడి, నిర్జీవ మయిన పిచ్చమ్మ శరీరం దగ్గరికి వెళ్ళి తడుముతూ, ఏడుస్తూ ఉన్నాడు అంకయ్య.

ఒక క్షణం వాతావరణం స్తంభించింది.

మరుక్షణం ముగ్గురూ గొల్లున ఏడ్చారు. ఇంక తమకి ఏది దిక్కు అనుకుని గుండెలు బెంబే లెత్తి, పిచ్చమ్మ లేకపోతే ఈ బ్రతుకులు ఏం గాను? అన్న ఆలోచన వచ్చి మనసులు చెదిరిపోగా బావురు మన్నారు. ఆర్తనాదాలు చేశారు. హృదయ విదారకంగా రోదించారు.

సత్రమూ మూగగా రోదించింది. బయట ఉన్న కుక్క తినటం ముగించి అప్రయత్నంగానే ఏడిచింది. విసురుగా గాలి వీచింది.

చివ్వున జల్లు విరుచకుని [illegible]. స్వార్థం కరిగి కన్నీరయి [illegible] కట్టింది.

నల్లటి మబ్బులు [illegible] పెఠిల్ పెఠిల్ అని పిడుగులు [illegible]. అంతవరకూ ఎలాగో నిలిచి [illegible] గోడ కూలిపోయింది. ఆ [illegible] కొమ్మా, [illegible] [illegible] గాలి వీస్తూనే ఉంది. ★